క్లుప్తంగా

పుష్పగుచ్ఛం అందజేత
రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు బుచ్చి లింగు, సంతోష్‌గౌడ్, ఒగ్గు బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

మంత్రి 'పొన్నం'ను కలిసిన నాయకులు


మంత్రి పొన్నంతో కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల: హుస్నాబాద్ ఎమ్మెల్యే, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సిరిసిల్ల కాంగ్రెస్ నాయకులు బుధవారం కలిశారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారి కరీంనగర్‌కు వస్తుండగా తిమ్మాపూర్ శివారులో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాయకులు గడ్డం నర్సయ్య, ఆకునూరి బాలరాజు, వైద్య శివప్రసాద్, దేవదాస్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

మంత్రిని సన్మానించిన పీఆర్ ఉద్యోగులు



సిరిసిల్ల: రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను బుధవారం హైదరాబాద్‌లో జిల్లా పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పూలగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. పీఆర్ ఉద్యోగుల సంఘం నాయకులు అయిలినేని పాపారావు, వినయ్, సృజన్ తదితరులు ఉన్నారు.

శ్రమదానం
వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని అగ్రహారంలోని సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2, జేఎన్టీయూ సిరిసిల్ల ఎన్ఎస్ఎస్‌యూ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో ముందుండడం అభినందనీయమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం
ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు పరిశుభ్రతతో పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి సంధ్యారాణి పేర్కొన్నారు. స్థానిక జూనియర్ కాలేజీలో రాష్ట్రీయ బాలల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థుల బరువు, ఎత్తు కొలిచారు. సాధారణ వైద్యపరీక్షలు చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ క్యాతం సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వాసర వేణి పర్శరాములు, వైద్యులు సాయిచంద్ర, ఫార్మసిస్టు అంజలి తదితరులు పాల్గొన్నారు.

నకిలీకార్డులు నమ్మొద్దు


కాముని వనిత

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వంపై కొందరు కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మహాలక్ష్మి' పథకంతోపాటు ఆరు గ్యారంటీలకు మార్కెట్లో అమ్ముతున్న నకిలీకార్డులను ప్రజలు నమ్మొద్దని సూచించారు. ఉచితబస్సు ప్రయాణానికి ఎన్నికల కార్డు, ఆధార్‌కార్డు చూపిస్తే చాలన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి బీజేపీ, బీఆర్ఎస్ ఫేక్‌కార్డులు తయారు చేస్తూ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలుచేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మాజీ సర్పంచ్ మృతి
ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్ మాజీ సర్పంచ్ పందిర్ల రాములుగౌడ్(70) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాములుగౌడ్ పరిస్థితి విషమించి ప్రాణాలు వదిలాడు. ఆయన భార్య దేవలక్ష్మి రెండేళ్ల క్రితం మరణించింది. కుమారుడు శేషగిరి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సౌదీ అరేబియాలో ఉన్న కొడుకు శేషగిరి తండ్రి అంత్యక్రియల కోసం గురువారం వస్తున్నాడు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ
వేములవాడరూరల్: వేములవాడ మండలం అగ్రహారంలోని సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ డా.వడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. శాతవాహన యూనివర్సిటీలో జరిగిన ఈ పోటీలకు డిగ్రీ కళాశాల నుంచి అఖిల్, అభినయ్ పాల్గొని ప్రతిభచాటారన్నారు. ఈ సందర్భంగా వారిని ఆయన కళాశాలలో సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మధు రాజేశ్, తదితరులున్నారు.

అన్నదానం.. ఆధ్యాత్మికం

- పదహారేళ్లుగా అయ్యప్పస్వాములకు భిక్ష
- పెరుగుతున్న భక్తిభావం
- స్ఫూర్తిగా నిలుస్తున్న నర్సాగౌడ్


భిక్ష చేస్తున్న అయ్యప్ప స్వాములు

ముస్తాబాద్: అయ్యప్పస్వాములకు 16ఏళ్లుగా భిక్ష పెడుతూ ఓ వ్యక్తి ఆధ్యాత్మిక భావం పెంపొందిస్తున్నాడు. మండలకేంద్రంలోని శ్రీహరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో నాగపూరి నర్సాగౌడ్ గత పదహారేళ్లుగా భక్తులకు అన్నదానం చేస్తున్నారు.

అన్నదానం కంటే మించింది లేదని..

గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన నర్సాగౌడ్, వెంకటేశ్వరి దంపతులు అయ్యప్ప భక్తులు. స్వామి దీక్షను తీసుకునే నర్సాగౌడ్, నియమ నిష్ఠలతో చేసే దీక్షలో భిక్ష తీసుకునేందుకు ఇబ్బందిపడ్డారు. దీంతో ఆయనే అయ్యప్పస్వాములు భిక్షకు ఇబ్బంది పడకూడదని 16 ఏళ్లుగా ముస్తాబాద్ అయ్యప్ప ఆలయంలో అన్న సంతర్పణ చేస్తున్నారు. తాను ఇబ్బందులు పడినా స్వాములకు భిక్ష అందిస్తున్నారు. గురువు రాజుగురుస్వామి ఆశయం మేరకు నిత్యం వందలాది మంది అయ్యప్పస్వాములకు అన్నదానం చేస్తున్నారు. అన్నదానానికి మించిన దానం మరొకటి లేదనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

నర్సాగౌడ్ స్ఫూర్తితో..

మండలకేంద్రంలోని అయ్యప్ప ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా రాజుగురుస్వామి ఆధ్వర్యంలో విలసిల్లుతోంది. ఇక్కడికి హైదరాబాద్, సిద్దిపేట, కామారెడ్డి, సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట నుంచి వేలాదిమంది భక్తులు వస్తుంటారు. వారికి అన్నదానం చేస్తున్న నర్సాగౌడ్ స్ఫూర్తితో నిత్యం స్వాములు రాత్రివేళలో తీసుకునే అల్పాహారం వితరణను గూడూరుకు చెందిన గురుస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ చీటి జితేందర్‌రావు గత ఆరేళ్లుగా అందిస్తున్నారు. రోజూ రాత్రి అయ్యప్పస్వాములకు అల్పాహారం అందిస్తున్నారు. అలాగే ఎంపీపీ జనగామ శరత్‌రావు మండల పూజతోపాటు వార్షికోత్సవం రోజు 4 వేల మందికి అన్నదానం చేస్తున్నారు. మండలపూజ రోజు గత ఐదేళ్లుగా ఉపసర్పంచ్ వేముల రవీందర్‌గౌడ్ 2వేల మందికి అల్పాహారం అందిస్తున్నారు.

ఇబ్బందుల్లేకుండా



నర్సాగౌడ్ పదహారేళ్లుగా అయ్యప్ప దీక్షస్వాములకు అన్నదానం చేయడం అభినందనీయం. నవంబర్ సంక్రాంతి వరకు ఇక్కడ అన్నదానం చేస్తారు. దీక్ష తీసుకున్న స్వాములకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నదానం చేస్తున్నారు.

– రాజుగురుస్వామి, ముస్తాబాద్

భిక్ష పెట్టడం అదృష్టం



దీక్ష తీసుకున్న స్వాములకు భిక్ష పెట్టడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా. ఎవరైనా స్వామి దీక్ష తీసుకోవాలంటే ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో వేళకు భిక్షను అందిస్తున్నాం. ఖర్చులకు వెనుకాడకుండా సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

– నాగపూరి నర్సాగౌడ్

గొప్ప అనుభూతి



అయ్యప్ప ఆలయంలో జరిగే ఉత్సవాల్లో అన్నదానం చేయడం గొప్ప అనుభూతి. స్వాములలో ఆధ్యాత్మిక భావన పెంపొందేలా రాజు గురుస్వామి ఆదేశాలతో అన్నదానం చేస్తున్నాం. యువకులు, వ్యాపారులు, ఉద్యోగులకు ఏ సమయంలోనైనా భిక్ష సిద్ధంగా ఉంటుంది.

– జనగామ శరత్‌రావు, ఎంపీపీ

పోటీ పడుతున్నారు



ముస్తాబాద్ అయ్యప్ప ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోంది. ఇక్కడ భక్తులకు ఇబ్బందులు లేకుండా అల్పాహారం అందిస్తున్నా. ఆలయ అభివృద్ధితోపాటు ఇతర సేవలను విస్తరిస్తున్నాం. అన్నదానం చేసేందుకు భక్తులు పోటీపడుతున్నారు. నర్సాగౌడ్ చేస్తున్న సేవలు మర్చిపోలేనివి.

– చీటి జితేందర్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్

ఐదేళ్లుగా అల్పాహారం



ప్రతి సంవత్సరం మండల పూజ రోజు రెండు వేల మంది భక్తులకు అల్పాహారం అందించడం అదృష్టం. గురుస్వాముల స్ఫూర్తితో ఐదేళ్లుగా అల్పాహారం అందిస్తున్నాం. అన్నదానం కంటే మరో దానం లేదు. ఇలాంటి సేవలో ముందుండటం సంతృప్తిగా ఉంది.

– వేముల రవీందర్‌గౌడ్, ఉపసర్పంచ్

మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ జనగామ శరత్‌రావు


మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్: మండలాన్ని జిల్లాలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ నేతృత్వంలో అన్నిరంగాల్లో మండలం అభివృద్ధి చెందిందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అభివృద్ధి పనుల్లో భాగస్వాములైనట్లు తెలిపారు. ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులపై సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. అంతకు ముందు గ్రంథాలయం కోసం నిర్మాణం ఎప్పుడు చేపడుతారో చెప్పాలని ఎంపీటీసీ శ్రీనివాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. గూడెంలో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ సరిత తెలిపారు. రాంరెడ్డిపల్లెకు మిషన్ భగీరథ నీరు రావడం లేదని సర్పంచ్ పోచయ్య తెలిపారు. మండలానికి భగీరథ నీరు సరిపోవడం లేదని సర్పంచ్ సుమతి చెప్పారు. మూడేళ్ల క్రితం చేసిన పనులకు ఇంకా బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్తాబాద్, పోతుగల్ రహదారిలో ఉన్న మానేరు కెనాల్‌పై వంతెన నిర్మించాలని సభ్యులు కోరారు. పెండింగ్ పనులను డిసెంబర్‌లో పూర్తిచేసి బిల్లులు పొందాలని ఎంపీపీ కోరారు. ఇందిరమ్మ కాలనీలో అక్రమ కట్టడాలు ఆపాలని ఎంపీటీసీ కోరారు.

సర్పంచ్‌లకు ఆత్మీయ సన్మానం

జనవరి 30తో పదవీకాలం ముగుస్తున్నందున సర్పంచ్‌లను ఎంపీపీ శరత్‌రావు ఘనంగా సన్మానించారు. వారు ఐదేళ్లలోచేసిన సేవలను కొనియాడారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీడీవో రమాదేవి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రావు, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పరామర్శ
చందుర్తి : మండలంలోని బండపల్లి గ్రామంలో మృతుల కుటుంబాలను బీఆర్ఎస్ నాయకుడు, వేములవాడ ఏఎంసీ మాజీ అధ్యక్షుడు ఏనుగు మనోహర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. గ్రామంలోని మాజీ ఉపసర్పంచ్ కొండ బాలకృష్ణగౌడ్ , గడ్డం ముకుందరెడ్డి గుండెపోటుతో మృతిచెందారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇక్కడ కోరం సింగిల్‌విండో అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కొండ లక్ష్మణ్‌గౌడ్, బింగి స్వామి, గడ్డం ఉపేందర్‌రెడ్డి, చింతలపల్లి మునీందర్‌రెడ్డి, కాసారపు గంగాధర్ గౌడ్, మల్యాల గంగ నర్సయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లికి చెందిన రైతు తీపిరెడ్డి లక్ష్మారెడ్డి మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయనవెంట ఉపసర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి, నాయకులు పన్నాల లక్ష్మారెడ్డి, తదితరులున్నారు.

దుప్పట్లు పంపిణీ



ముస్తాబాద్: మండలంలోని చిప్పలపల్లిలో వృద్ధ మహిళలకు చిట్నేని వెంకటేశ్వర్‌రావు, మాధవి దంపతులు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. 20 మంది పేదలకు దుప్పట్లు అందజేసిన దంపతులకు వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు విద్యాసాగర్‌రావు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ కొమ్మాటి రాజమల్లు, మాజీ సర్పంచ్ గాడిచెర్ల దేవయ్య, రాజలింగం, చందన రాజయ్య, నర్సయ్య, అంజయ్య, శ్రీనివాస్, కిషన్, అమర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం వితరణ


ప్రసాదం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రుద్రంగి: వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలవడంతో హర్షం వ్యక్తంచేస్తూ కాంగ్రెస్ మండల నాయకులు బుధవారం మండలకేంద్రంలో వేములవాడ రాజన్న లడ్డూ ప్రసాదాన్ని గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తూము జలపతి, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె లింగం, నాయకులు ఎర్రం గంగ నర్సయ్య, పల్లి గంగాధర్, గండి నారాయణ, మల్లేశం, ఇప్ప మహేశ్, యాదయ్య, మహిపాల్, గంగాధర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

రైతుల సమావేశం
ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రం శివారు సింగసముద్రం ఆయకట్టు పరిధిలోని ఎనిమిది వందల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవకాశముందని అందుకనుగుణంగా ఈ సీజన్‌లో తైబంధి నిర్ణయించి రైతులు పంటలు సాగుచేసుకోవాలని నిర్ణయించారు. కిష్టంపల్లిలో బుధవారం నీటి వాడకంపై సమావేశమయ్యారు. ఇప్పటికే దుబ్బకాలువ, బొజార్ల, బొజార్లకింది కాలువల పూడికతీత పనులను చేపట్టారు. ఈ సందర్భంగా సింగసముద్రం కనెక్టింగ్ కాలువల కమిటీ చైర్మన్ ఒగ్గు బాల్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. సింగసముద్రం కింద సాగునీరందించే కాలువలను పూడికతీత పనులకు వినియోగించాలన్నారు. నీటిసామర్థ్యాన్ని బట్టి తైబంధి ప్రకారం రైతులు పంటలు సాగుచేసుకోవాలన్నారు. రైతులు గోపాల్‌రెడ్డి, దేవయ్య, వేణుయాదవ్, వెంకటి, విఠల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన
రుద్రంగి(వేములవాడ): పత్తిపంటలో గులాబీ రంగు పురుగు నివారణకు వేసవిలో పంటచేలను లోతుగా దుక్కులు చేయాలని కరీంనగర్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ రైతులకు సూచించారు. బుధవారం కరీంనగర్ జిల్లా ఏరువాక కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో దెగావత్ తండాలో పత్తిలో గులాబీరంగు పురుగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పత్తిలో గులాబీరంగు పురుగు లక్షణాలు, నివారణ చర్యలపై శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్ వివరించారు. క్షేత్రస్థాయిలో రైతుల పత్తి పంటలను సందర్శించారు. శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్ డాక్టర్ మదన్ మోహన్, మండల, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నియామకం
సిరిసిల్లటౌన్: మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కల్లూరి చందన నియమితులయ్యారు. ఈమేరకు నియామకపత్రాన్ని బుధవారం జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత అందించారు. నాయకురాళ్లు మడుపు శ్రీదేవి, ఆడెపు చంద్రకళ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు. తన నియామకంపై నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పలువురికి తదితరులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.




ఘనంగా 'ఫైర్ లెస్ ఫుడ్ డే'
వేములవాడరూరల్: వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో బుధవారం ఫైర్ లెస్ ఫుడ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. చిన్న వయస్సులోనే నిప్పులేని వంటలు తయారు చేసిన చిన్నారులను కళాశాల బృందం అభినందించింది. మొట్టల హర్షవర్ధన్ పటేల్ చేసిన వంటకాలను పరిశీలించి ఉపాధ్యాయులు అభినందించారు.

బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారు

- కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యలు అధికారం కోల్పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్ విమర్శించారు. ఎల్లారెడ్డిపేటలోని పార్టీ ఆఫీస్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రిని ప్రశ్నించడం ఆ సమయంలో ప్రజల పక్షాన తమ హక్కు అని, ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీగా ప్రజలకు సేవ చేసే బాధ్యతలో ఉన్నామన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య వైఖరిపై వారి పార్టీ నాయకులే దుమ్మెత్తిపోస్తున్న విషయాన్ని గ్రహించాలని హితవు పలికారు. ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి ఆరోపణలు చేయాలని సూచించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు గుండాటి రాంరెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు సూడిద రాజేందర్, యూత్ అధ్యక్షుడు బానోతు రాజునాయక్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న నాయకులు

గంభీరావుపేట: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన 11, 12, 13 ప్యాకేజీ పనులు పూర్తయి, 9వ ప్యాకేజీ పనులు పూర్తికాకపోవడానికి కారణాలేంటో బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు కేకే మహేందర్‌రెడ్డిని విమర్శించడం మానుకొని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రాంచంద్రారెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు రాజుగౌడ్, సీనియర్ నాయకులు ఎర్ర నర్సయ్య, ప్రభాకర్, అంజాగౌడ్, రాజుగౌడ్, విఠల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన


నిరసన తెలుపుతున్న సిబ్బంది

బోయినపల్లి(చొప్పదండి): కేంద్రప్రభుత్వం గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మండల తపాలా శాఖ ఉద్యోగులు పేర్కొన్నారు. గ్రామీణ తపాలా సిబ్బంది (జీడీఎస్) దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం మండలకేంద్రంలోని సబ్ పోస్టు కార్యాలయం ఎదుట పోస్టల్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ టార్గెట్ మేళాల పేరిట జీడీఎస్‌లపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. పోస్టల్ సిబ్బందికి గ్రూప్ ఇన్సూరెన్స్ రూ. 5 లక్షలకు పెంచాలని, జీడీఎస్ కుటుంబసభ్యులకు వైద్యసౌకర్యం కల్పించాలని కోరారు. 8 గంటల పనిభారం కల్పించాలన్నారు. బోయినపల్లి ఎస్ఓ పరిధిలోని బీపీఎంలు, సిబ్బంది ఎగుర్ల రాజు, జీ. శ్రీకాంత్, కట్ట కిరణ్, జీ. తిరుపతి, ఏ. ప్రభాకర్, భూంరావు, విజయ్, చంద్రశేఖర్, జీవన్, అనూష, రాజు, నీరజ్, నాగభూషణం, శంకర్, అనీల్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే గెస్ట్‌హౌస్‌పై కాంగ్రెస్ జెండా

- బీఆర్ఎస్ హయాంలో భవనం మంజూరు
- కాంగ్రెస్ ఎమ్మెల్యే 'ఆది'కి అందుబాటులో



వేములవాడరూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి నియోజకవర్గానికి ఎమ్మెల్యే గెస్ట్‌హౌస్ కోసం ప్రత్యేక భవనాన్ని మంజూరు చేశారు. వేములవాడ నియోజకవర్గంలో మంజూరైనా కొన్నిరోజులుగా పనులు జరుగుతుండగా మాజీ ఎమ్మెల్యే రమేశ్ బాబుకు ఈ భవనం అందుబాటులోకి రాలేదు. ఎన్నికలు రావడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ప్రస్తుతం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆ భవనం అందుబాటులోకి రానుంది. దీంతో రెండ్రోజుల క్రితమే అభిమానులు కొత్త భవనంపై కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు.

మృతుడి కుటుంబానికి చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేసిన దండు రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మంజూరైన ఈపీఎఫ్‌వో ఈడీఎల్ఐ మెచ్యూరిటీ, పెన్షన్ మంజూరైంది. రూ. 5,39,096 చెక్కు, నెలవారి పింఛన్ పత్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్‌లు మృతుడి భార్య మణెవ్వకు అందించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ సుకుమార్, సూపర్‌వైజర్ ఉమర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం
ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలకేంద్రానికి చెందిన కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్‌కుమార్, పర్యావరణ పరిరక్షకుడు దుంపెన రమేశ్ ఇటీవల విజయవాడలో జాతీయస్థాయి అవార్డులు అందుకున్నారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు వివిధ రంగాల్లో చేసిన సామాజిక సేవలను గుర్తించి జాతీయస్థాయికి ఎంపికచేసినట్లు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి శర్మ,నాయకులు బందారపు బాల్‌రెడ్డి, మెండే శ్రీనివాస్, జగన్‌రెడ్డి, పద్మారెడ్డి, గిరిధర్ రెడ్డి, బాల్‌రెడ్డి, రవి, స్వామి, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు

నేటినుంచి ఇసుక రీచ్ ప్రారంభం
వేములవాడరూరల్: మండలంలోని బొల్లారం గ్రామంలో గురువారం నుంచి ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. వేములవాడ రూరల్ గ్రామాలకు మాత్రమే ఇసుకను తరలించేందుకు అనుమతులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రిప్పుకు రూ. 300 డీడీ చెల్లించిన యజమానులకు మాత్రమే ఈ అనుమతులు ఇస్తున్నట్లు ఆమె తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం
కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల, ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో బాలబాలికలకు యూనిఫామ్స్ కుట్టేందుకు అర్హులైన దర్జీలనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు దరఖాస్తులను 'ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల సంస్థ, అంబేడ్కర్ భవన్ ఎదురుగా, హన్మకొండలో ఈనెల 15లోపు అందించాలన్నారు.